## ఆమెలో రేగిన ద్వేషాగ్ని ఎవరి ఆనందాన్ని దహించింది?

# పచ్చమేడ

### రాగతి రమ కథ

**ఎదురింటి పచ్చమేడ కళకళలాడిపోతూ వుంది.**

ఆ ఇంటి యజమాని లింగయ్య. ఆయన మద్దుల మూడో కూతురికి పెళ్లి జరుగబోతూ వుంది ఎల్లుండి.

''అమ్మా వాళ్లమేడ ఎంత అందంగా వుందో!'' అంది పదేళ్ల శశికళ.

ఆ పిల్ల ఎదురింటి అందాన్ని రోజంతా చూస్తూనే వుంది.

''అవునమ్మా వాళ్లు డబ్బున్నవాళ్లు'' అంది శశికళ తల్లి శారదమ్మ.

''ఎందుకమ్మా మనకు డబ్బు లేదు. వాళ్లకు అంత ఎక్కువ వుంది?'' అడిగింది శశికళ. శాంతమ్మ వినుకోలేదు.

''దేవుడు అలా రాశాడమ్మా... ఏం చేస్తాం!'' అంది నీడలు మనసులు మెదులుతుంటే.

''నాన్నకి చిన్న గుమస్తా ఉద్యోగం - అందుకే కదమ్మా మనం ఇలా ఉన్నాం'' శాంతమ్మ మాట్లాడలేదు.

''నాన్న సారా తాక్కుండా వుంటే మనం ఇలా చింకి బట్టలు వేసుకోక పోదుము కదమ్మా''

శారదమ్మకు దుఃఖం ముంచుకొచ్చింది.

''అమ్మా మనం పెద్దక్కకు కట్నం ఇచ్చి పెళ్లిచేసి మరీ బీదవాళ్లం అయిపోయాం కదమ్మా''

''అబ్బ నీ ప్రశ్నలు ఆపవే - రేపటినుండి ఈ మూడు రోజులు నాకు తీరికుండదు. వంటలకి సాయానికి రమ్మన్నారు వాళ్లు. రేపు లేవగానే స్నానం చేసి అక్కతో జడలు వేయించుకో. మధ్యాహ్నం రెండు గంటలకు మీరిద్దరూ అన్నానికి రండి. కొద్దిగా చద్దన్నం వుంచాను. మీరిద్దరూ తినండి. ఏ వేళకు అవుతాయో భోజనాలు''

''అమ్మా!'' పిల్చింది శశికళ.

''ఏమిటమ్మా...?''



''చిన్నక్కకు కూడా పెళ్లిచేద్దామే. మనం ఇంట్లోకూడా చక్కగా ఇలా అందర్నీ పిలిచి భోజనాలు పెట్టి...''

''మనకా అదృష్టాలు ఎక్కడమ్మా... పడుకో మాట్లాడకు'' అంది శారదమ్మ మంచంమీద నడ్డి వాలుస్తూ.

''అమ్మా! నాన్న మన డబ్బంతా పాడుచేశాడా?''

శారదమ్మ నిద్ర ఒక్కసారిగా ఎగిరిపోయింది.

''ఎవరు చెప్పారు?''

''మహాలక్ష్మి అత్తయ్య చెప్పిందమ్మా''

''ఇంకా ఏం చెప్పింది?''

''మనమూ బాగా డబ్బున్నవాళ్లమే అయితే నాన్న పేకాట ఆడి, నాన్న సారా తాగి అంతా పాడు చేశాడటకదమ్మా... అంటే అంతా ఖర్చుపెట్టేశాడటకదమ్మా! నిజమేనా అమ్మా...?

శారదమ్మకు దుఃఖం ఆగలేదు.

భర్త గుర్తుకొచ్చాడు. తాగుతూ ఎక్కడో పడి పోయి వుంటాడు. ఇల్లంతా గుల్ల చేశాడు. చెట్టంత కూతురు ఎదిగి వుంది. పెద్దకూతురి పెళ్లికి చేసిన అప్పు పాపంలా పెరిగిపోతూ వుంది. బంగారంలాంటి గవర్నమెంట్ ఉద్యోగంలో వుంటూ డబ్బు స్వాహా చేశాడు. సస్పెండ్. ఆరు నెలలు జైలుశిక్ష, అసలు ప్లస్ ఫైను... అన్నీ కట్టి బైటపడేటప్పటికి చిల్లపెంకులు మిగిలాయి. ఉద్యోగం ఊడింది. ఎక్కడో 500 రూపాయలకి పద్దులురాస్తూ సంపాదిస్తున్నాడు. తిన్ననాడు తిండి. లేనినాడు పస్తు. ఏమిటో ఈ జీవితం. ఎక్కడికో ఈ ప్రయాణం... పిల్లలకి చదువులు లేవు, చట్టుబండలూ లేవు. ముద్దులేదు, ముచ్చటా లేదు. రెండోది వయస్సు పెరిగి కుంపట్లా కూర్చుంది. ఎవడొస్తాడు. కట్నం ఇవ్వకుండా? తాడూ బొంగరమూ లేని ఇంటికి అల్లుడవడానికి ఎవడొప్పుకుంటాడు?

పిల్ల బాగుంది. పిల్ల లక్ష్మిలా వుంది. వినయ విధేయతలున్నాయి. మంచి పిల్ల. ఇవన్నీ ఎవడిక్కావాలి? వాళ్లకు డబ్బే ముఖ్యం. లక్ష కట్నం కాదూ అంటే 50 వేలకి తక్కువ లేదు. పిల్లల్లో ఏవన్నా చెడ్డ లక్షణాలుంటే తర్వాత మేం సరిచేసుకుంటాం లెండి. ముందు కట్నం సంగతి తేల్చండి అంటారు. ఏమిటో మాయ. అందరికీ డబ్బే కావాలి. డబ్బుకి లోకం దాసోహం. నిజమే డబ్బు లేకపోతే జీవితం ఎంత యాతన. ఎంత నిస్సారం. అల్లకీ ఈల్లకీ తలలో నాలుకై వుండి ఇంత సాయం చేస్తూ విస్తళ్లు కుట్టి అప్పడాలువత్తి ఏదో నాలుగు పైసలుసంపాదిస్తూ వుండబట్టి నాలుగు వేళ్లూ నోట్లోకి వెళ్తున్నాయి. లేకపోతే శారదమ్మ మగతలో జారింది.

తెల్లవారింది. శశికళ కళ్లు విప్పింది. కిటికీలోంచి పచ్చమేడ కళకళలాడిపోతూ వుంది. అటునుండి కమ్మటి వాసనలు. ఇప్పుడు వాళ్లు కాఫీలు, టిఫిన్లు చేస్తూ వుంటారు. అమ్మ ఇప్పుడు రావద్దంది. భోజనానికే రమ్మంది. అబ్బ అప్పటివరకు ఆగాలిరా బాబూ... స్నానంచేసి పెట్టెలో పచ్చగౌను తొడుక్కోమంది అమ్మ. నూనెరాసి అక్కడే రెండు జడలూ వేయించుకోమంది. అక్కేది... అబ్బ ఎంత మొద్దునిద్ర బాబూ... ఇంకా లేవదు. నాకు జడలు ఎప్పుడు వేస్తుంది. తను ఎప్పుడు తయారవుతుంది. దాని పనులన్నీ లేటే.

''అక్కా లెగు, మనం భోజనానికి వెళ్లాలి'' లేపుతూ అంది శశికళ.

లీల కళ్లు విప్పింది. మండుతున్న అగ్నిగోళాల్లా వున్నాయి కళ్లు.

''అక్కా బేగా లెగు లెగు. మనం రాగిణి వాళ్ల ఇంటికి భోజనానికి వెళ్లాలి''

''ఛ. ఎప్పుడూ నీకు తిండిగోలే. ఆ పొగరుబోతు గొప్పదాని ఇంటికి నేను ఛస్తే రాను. వాళ్లింట్లో చచ్చినా భోజనం చెయ్యను'' అంది చిరాకుగా లీల.

''అబ్బ. ఎందుకక్కా వాళ్లంటే అంత ఇష్టం వుండదు. ఎవరక్కా వాళ్లింట్లో అంత పొగరుబోతుగలవారు?''

''ఇంకెవరు... ఆ రాగిణి మహాతల్లి. పెళ్లిపీటలమీద కూర్చోబోయే పెళ్లికూతురు. నన్నెంత అవమానించిందనీ... మనకు పూటకు గతిలేదట! నాకు పెళ్లే కాదట. పేదవాళ్లకు పెళ్లి

కావడమే ఎంతో కష్టమట! నా చిరిగిన చీర చూసి జోకులు వేసింది దాని స్నేహితురాళ్లతో. మనలాంటి డబ్బులేనివాళ్లు ఎప్పుడూ ఏడుపు మొఖాలతో జీవితం సాగించే చేతకాని పిరికి మనుష్యులట!

ఎందుకు బ్రతుకుతారో - ఎందుకు నవ్వుతూ ఏడుస్తూ వుంటారో తెలీని శవాలట!'' లీల ఏడుస్తూ వుంది. వెక్కి వెక్కి ఏడుస్తూ వుంది.

అవును మనవి చింకిబ్రతుకులే... పగిలిన అద్దాలతో ముఖాలు చూసుకుంటూ పౌడరు రాసుకునే బ్రతుకులు మనలవి. నా కాళ్లమీద నేను నిలబడతాను. ఎందరో అమ్మాయిల్లా ఉద్యోగం చేసుకుని బ్రతుకుతాను అంటే చదివించలేదు. అసలు డబ్బెక్కడిది... ఫీజులకి, పుస్తకాలకి? డబ్బులేదు. అందుకే చదువు లేదు. కట్నం ఇవ్వలేరు. అందుకే పెళ్లికాదు. ఒకవేళ చేసినా ఏ చిప్పలాంటివాడ్నో, పుచ్చులాంటివాడ్నో అన్ని వ్యసనాలున్న చిరిగిన చాపలాంటివాడ్నో చేస్తారు. నాకు ఇష్టం లేదు.

మెరిసిపోయే అందాల రాకుమారుడే కావాలి అననుగానీ అందగాడే కావాలి. డబ్బుండాలి. చదువు-ఉద్యోగం వుండాలి. ఎవరు తెస్తారు అలాంటివాడ్ని. ఎన్ని సంవత్సరాలైనా నా బ్రతుకు ఇంతే! నన్ను చూసి పుట్టింటికి వచ్చినప్పుడల్లా రాగిణి నవ్వుతుంది. పగలబడి నవ్వుతుంది. వెక్కిరిస్తుంది. వెటకారం చేస్తుంది. ఏడిపిస్తుంది. లీల ఏడుస్తూ వుంది.


శశికళకే వస్తూ వుంది దుఃఖం.

''అక్కా ఆ రాగిణి ఎన్ని మాటలన్నా ఎందుకక్కా ఏమీ అనవు?''

''అమ్మ నన్ను అలా పెంచింది. నాకు పిరికిమందు పోసింది. రాగిణీ, దాని స్నేహితులూ ఎప్పుడూ నన్ను వేధించేవారు. ఆ మాటే అమ్మతో అంటే అమ్మ అనేది...

''ఎప్పుడూ ఎవర్నీ ఏమీ అనకూడదమ్మా. నిన్నెవరైనా అన్నారనుకో వాళ్ల పాపానికి వాళ్లే పోతారు. మంచి వాడెప్పుడూ పెదవి విప్పడు. పెదవి విప్పనివాడే మంచివాడు.

మంచికి మంచి, చెడ్డకు చెడ్డ జరిగి తీరుతుందమ్మా - నవ్వు అలాగా చూస్తుండు. నువ్వు మాత్రం నోరువిప్పకు. నోరు విప్పి తిట్లు తిడితే భగవంతుడు క్షమించడమ్మా'' అని నా నోరు కట్టేసిందే శశీ... అమ్మ నాకు పిరికిమందు పోసిందే - నన్ను చేతకాని చవటను చేసిందే. ఇప్పుడు నేను



రాగిణికి సరైన సమాధానం చెప్పలేని గడ్డిపూవులా తల వాల్చేస్తున్నానే - ఎన్నిమాటలన్నా ఎదుర్కొని సరైన సమాధానం చెప్పే ధైర్యాన్ని, తెలివినీ పోగొట్టుకున్నానే... నాకు మిగిలిందిప్పుడు ఒక్కటే రాగిణి అంటే ద్వేషం! ఇప్పుడు నాకు కావలసింది ఒక్కటే రాగిణి పెళ్లి ఆగిపోవడం... ఈ పెళ్లి జరక్కూడదు. సడన్‌గా ఆగిపోవాలి. ఒక భయంకరమైనదేదో జరిగిపోవాలి. ఆ పెళ్లికొడుకు - ఛీ ఇది మంచిదికాదూ - ఇది నాకొద్దూ అనాలి... పెద్ద తుఫాను వచ్చేయాలి, చెట్లు విరిగిపోవాలి. గాలి దుమారం వచ్చి పెళ్లి పందిరంతా కూలిపోవాలి, లేదా సముద్రం పొంగి ఇళ్లను ముంచెత్తాలి... ఇందులో ఏ ఒక్కటీ జరుగకపోయినా నేను చచ్చిపోతానే శశీ చచ్చిపోతానే - అది పెళ్లిచేసుకుని వురంత సంతోషంతో విర్రవీగిపోతూ వుంటే నేను చచ్చిపోతానే. సముద్రంలో పడిపోతానో, విషమే తాగేస్తానో, మేడమీద నుంచి దూకేస్తానో, కిరసనాయిలు పోసుకుని నిప్పంటించుకుంటానో నాకే తెలీదు. ఏదో చేసేస్తాను''

లీల ఏడుస్తూ వుంది.

ఆకాశం విరిగి మీద పడిపోయినట్టు - సముద్రం పొంగిపోయినట్టు - భూమి బద్దలైపోయినట్టు - జరగరానిదేదో జరిగిపోతున్నట్టు లీల ఏడుస్తూ వుంది.

''అక్కా ఏడవకక్కా నాకూ ఏడుపొస్తూ వుందక్కా''

లీల ఏడుపు ఆపలేదు. వాళ్లిద్దర్నీ చూస్తూ ఎదురింటి పచ్చమేడ పగలబడి నవ్వుతూ వుంది. పెచ్చులూడి, మాసిపోయిన గోడలతో మురికిగా వున్న ఆ గది వాళ్లిద్దరినీ చూస్తూ కంట తడిపెట్టుకుంటూ ఉంది.

''అక్కా ఏడవకక్కా'' శశికళ వెక్కివెక్కి ఏడవడం మొదలుపెట్టింది.

''లేదే శశీ నేను చచ్చిపోతాను. నేనీ ద్వేషాన్ని ఆపుకుంటూ బ్రతకలేను''

''ఒద్దక్కా చచ్చిపోవద్దక్కా''

''మరేం చేయనే... దాని పెళ్లి జరిగిపోతూ వుంది. ఎల్లుండే దాని పెళ్లి. దాని పెళ్లి ఆగదు. నాలో దుఃఖం సముద్రంలా పెరిగిపోయి సంవత్సరాలు గడిచినా తరగదే శశీ...''

''లీలక్కా మరి, ఆ పెళ్లి ఆగిపోవాలంటే ఏం చేయాలి?''

ఏం చేయాలా...? లీల ఒక్క క్షణం ఆలోచించి చెప్పింది.

ఆసిడ్ దాని ముఖంమీద పోసేయాలి. దాని అందం అంతా కాలి అహంకారం తగ్గిపోతుంది. లేదా కిరసనాయిలు పోసి ఇంటికి నిప్పంటించాలి. లేదా ఏమోనే తెలీడంలేదు. కాని మొత్తానికి దానికి ఏదో జరిగిపోవాలి. అది నాశనం అయిపోవాల. కానీ ఏం చేస్తే జరుగుతుందో తెలీడంలేదు'' విచారంగా అంది లీల.

''అక్కా నువ్వు భోజనానికి రావా అయితే''

''రానే. నువ్వెళ్లు''

''నేనూ వెళ్లనక్కా. నాకూ రాగిణి అంటే కసిగా, ద్వేషంగా వుందక్కా''

''హమ్మయ్య, నువ్వొక్కదానివి నన్ను సరిగా అర్థం చేసుకున్నావు'' అంది లీల.

శశి స్నానం చేసింది. అమ్మ చెప్పినట్టు పచ్చగౌను వేసుకుంది. ఆకలి తగ్గిపోయింది. అందుకే చద్దన్నం తినలేదు.

శశి మనస్సు ద్వేషంతో నిండిపోయి వుంది. ఏమీ చేయలేని నిస్సహాయస్థితే ద్వేషానికి పునాది. ఏ మనిషైనా మరో మనిషిని ఆట పట్టించినప్పుడు అదే విధంగా తిప్పికొట్టాలి. లేకపోతే చేతకానివాడు అంటారు. బూతులు మాట్లాడేవాడితో అదేవిధంగా బూతుగా సమాధానం చెప్పకపోతే మృదువుగా

వ్యవహరిస్తే మరింత రెచ్చిపోతాడు. చవటలా చూస్తాడు. అందుకే చెడుకి చెడుగానే సమాధానం ఇవ్వకపోతే అది మంచితనం కాదు. చేతకానితనం. అది సమర్థత కాదు. అసమర్థత. అది ధైర్యంకాదు. పిరికితనం.

అటువంటి వ్యక్తిని మరింత ఏడిపించాలని చూస్తారు జనం. అందుకే మంచికి మంచి చెడుకు చెడు. అప్పుడు ద్వేషానికి తావులేదు.

అలా జరుగనప్పుడు - అందుకే ఈ ద్వేషం - లీలలో రాజుకుంటున్న అగ్నిలా విస్తరిస్తున్నా దావాగ్నిలా కోరలు చూస్తూ పైపైకి పోతున్న జ్వాలాగ్నిలా ద్వేషం... ద్వేషం... ద్వేషం...!!!

శశి లేత మనస్సులో అక్క మాటలు లోతుగా నాటుకున్నాయి. చాలా విచారంగా దుఃఖంలా వుంది శశికి. పెరట్లోకి వెళ్లి మెట్లమీద కూర్చుంది. అప్పుడే వచ్చిన సూర్యాకాంతం పువ్వొకటి శశినే జాలిగా చూస్తూ వుంది. రాత్రి పూసిన చంద్రకాంతలు శశి దుఃఖాన్ని చూడలేనట్టు ముడుచుకుపోయాయి. ఈ పిల్ల దుఃఖాన్ని ఎలా దూరం చేయాలిరా భగవంతుడా అన్నట్టు ఆలోచిస్తూ వున్న తల్లిలా ఆగిపోయాయి పిల్ల తెమ్మెరలు. తెల్లపిల్లి పిల్లొకటి నన్ను చూసైనా విచారాన్ని మర్చిపోవూ అన్నట్టు శశి కాలు నాకుతూ కూర్చుంది.

ఆలోచిస్తూ శశి మెల్లగా లేచి పచ్చమేడవైపు నడిచింది. అందాలు చిందించే పచ్చమేడ గర్వంగా హేళనగా నవ్వుతూ శశికళనే చూస్తూ వుంది.

వంటగది గుమ్మంలోకి వెళ్లి తల్లికోసం చూసింది. ఏదో పని చేస్తూ అప్పుడే వచ్చింది శారదమ్మ.

''అప్పుడే ఎందుకు వచ్చావే తిండికి రెండు గంటలకి రమ్మంటే?'' చిరాగ్గా అంది శారదమ్మ.

తల్లి మాటలు శశికి కళ్లల్లో నీళ్లు తెప్పించాయి.
''అన్నం కోసం రాలేదమ్మా...?''

''మరెందుకే వచ్చావు? వాళ్లంతా భోజనానికి కూర్చుంటున్నారు. బాగోదు. వెళ్లు వెళ్లు'' అంది శారదమ్మ.

ఎప్పుడూ లేనిది శశికి తల్లిమీద పట్టరాని కోపం వచ్చింది.

''ఛీ... ఈ పాడు తిండికోసం ఏమీ రాలేదులే'' అంటూ చరచరా వెళ్లిపోయింది. అలా వెళ్లిపోతున్న కూతుర్ని వింతగా చూస్తూ వుండిపోయింది శారదమ్మ.

## లేచిపోయింది

''నీతో లేచొచ్చిన అమ్మాయి కనిపించడంలేదేమిటి?''
''మా ఎదురింటి ఆయనతో లేచిపోయింది''
''ఆ...!''

- సూరయ్యగారి రమేష్ (మెదక్)



శశి మేడమీదకు నడిచింది. పట్టుచీరల పోటీ వున్నట్టు అందమైన రంగు రంగుల చీరలు, పూలవాన కురిసినట్లు గదుల్లో పూలరేకులు, కాళ్లకింద మెత్తని తివాచీ ఇల్లంతా సెంటు పరిమళాల వాసన. ఒక గదినిండా అరటిగెలలు, కొబ్బరి బోండాలు, ఇంకో గదిలో స్వీటు డేసాలతో లడ్డులు, అరిసెలు, మైసూర్‌పాక్‌లు - ఇంకో గదిలో అందాల హీరోయిన్‌లా - ఆకాశంలో తార ఏదో రాలిపడినట్టు - వెన్నెల కిరణం పరుచుకున్నట్టు మెరిసిపోతూ రాజకుమార్తెలా లీవిగా కూర్చుని వుంది పెళ్లికూతురు రాగిణి. గదిలో ఇంకా ఇద్దరు వున్నారు.

శశి రాగిణిని చూసింది. రాగిణి చూసింది. ఆమె కళ్లలో మదించిన గర్వం.

''ఇదిగో ఇలా రా'' పిల్చింది రాగిణి.

శశికి ఇష్టంలేదు. కాని దగ్గరగా వెళ్లింది.

''మీ అక్కేం చేస్తోంది?'' నవ్వుతూ అడిగింది.

''వుంది''

''ఎక్కడా?''

''మా ఇంట్లో''

''తర్వాత భోజనానికి వస్తుందా?''

''ఏమో తెలీదు''

''వస్తే కాస్త మంచి చీర కట్టుకు రమ్మన్నానని చెప్పు... నీకు ఇంకో గౌను లేదా - ఇలాంటిది వేసుకొచ్చావ్? అన్నట్టు ఈ మూడురోజులూ మా ఇంట్లోనే భోజనాలుకదా మీకు - నువ్వూ, మీ అక్కా ఈ మూడురోజులు హాయిగా, సుష్టుగా తినండి''

రాగిణి కళ్లు నవ్వుతున్నాయి గర్వంతో, డబ్బు మదంతో. శశి మాట్లాడలేదు. అక్కకి ద్వేషం ఎందుకు వచ్చిందో... అక్కకి దుఃఖం వరదలై పారి ప్రవహి వుంది ఎందుకో... ఎందుకో బాగా తెలిసిపోతూ వుంది. శశి మనస్సులో ద్వేషం సుడులు తిరుగుతూ వుంది, ఏదో చేయాలి.

గదిలో ఇద్దరు ముగ్గురు పేరంటాళ్లుకూడా వెళ్లిపోయారు.

రాగిణి కన్నుల్లో రమేష్.

ఆనంద తరంగ వీచికల్లో రాగిణి స్వప్నలోకంలో రాగిణి... మూడు మెట్లు దిగింతర్వాత ఒక్క క్షణం కాలుజారి కెవ్వుమన్న రాగిణి తూలిపోయి, తేలిపోయి, స్వప్నజగత్తు వీడిపోయి మెట్లమీదనుండి దొర్లిపోయింది రాగిణి. స్పృహతప్పి పడిపోయింది రాగిణి. మరింక స్పృహరాదని చెప్పేశారు డాక్టర్లు.

పచ్చమేడ దద్దరిల్లింది శోకాలతో. పోలీసులు వచ్చారు. ఎలా పడిపోయిందీ ఆరా తీశారు.

''నేనే తోసేసాను'' శశికళ చెప్పింది.

''ఎందుకు తోశావు?''

మా అక్కని హేళన చేస్తోంది. మమ్మల్ని హీనంగా చూస్తోంది. అందుకే ద్వేషం, అసహ్యం, కోపం రాగిణి అంటే!

''డబ్బుగల మనుష్యుల్ని చూస్తే డబ్బులేని మనుష్యులకు ద్వేషం'' అన్నారు పోలీసులు. శశికళను అరెస్టు చేశారు.

''చిన్నపిల్ల దానికేం తెలీదు. దాన్ని జైల్లో పెట్టొద్దు'' ఏడ్చింది శారదమ్మ.

''నన్నుపెట్టండి జైల్లో. నేను చెడ్డోడ్ని. తాగి తప్పుచేసిన వాడిని. పేకాట ఆడి పాపం చేసినవాడిని. నన్ను పెట్టండి'' ఏడ్చాడు తండ్రి.

''నావల్లే ఇలా జరిగింది. అది నిర్దోషి దీని మనస్సులో ద్వేషం నింపింది నేనే. నాకోసం అలా చేసింది. నన్ను పెట్టండి జైల్లో'' అని ఏడ్చింది లీల.

రాగిణి చచ్చిపోయింది. పెళ్లి ఆగిపోయింది. మా అక్క ద్వేషం తీరిపోయింది. నా కోసం పారిపోయింది. నాకెంతో సంతోషంగా వుంది. పచ్చమేడ గొల్లుమంటుంటే'' అనుకుంది శశి ఆనందంగా జైల్లో కూర్చుని.

◆ ◆ ◆